# కథాకేళి



## మల్లాది వెంకటకృష్ణమూర్తి

# రెండో తప్పు

సోమనాథ్ జీవితంలో చేసిన ఏకైక తప్పు తన ఏభై రెండవ ఏట జ్వాలని పెళ్ళి చేసుకోవటం. ఆమె వయసు ఇరవై రెండు. ఒకానొక బుద్ధి గడ్డి తిన్న ఘడియలో ఆమెని వివాహం చేసుకోవాలనుకున్నాడు. చేసుకున్నాడు.

తన వ్యాపార వ్యవహారాలు చూసుకోడానికి సోమనాథ్ తరచూ ఇతర వూళ్ళు వెళ్తూండాలి. నాలుగైదు రోజులు తను దూరంగా వున్నప్పుడు జ్వాల తన ఆఫీస్ మేనేజర్ తోనో, ఎదురింటి ఇంజనీర్ బావమరిదితోనో తిరుగుతోందనే గాఢమైన నమ్మకం సోమనాథ్ లో ఏర్పడిపోయింది.

ఈ వయసులో ఇది ఆయనకో మానసిక బాధగా మారింది తన అనుమానానికి అనేక కారణాలు వున్నాయి.

ఆలోచించి చివరికి ఓ నిర్ణయానికి వచ్చాడు.

ఓ ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీ ఆఫీస్ కి వెళ్ళి. జ్వాల ఫోటో ఇచ్చాడు. ఆమె శీలాన్ని తను శంకిస్తున్నానన్న సంగతి చెప్పకుండా, నాలుగు రోజులపాటు ఆమెని ఇరవై నాలుగ్గంటలూ కనిపెట్టి, ఆమె దినచర్యని యధాతధంగా రిపోర్ట్ రాసివ్వమని కోరాడు. రోజుకి రెండువందల రూపాయల చొప్పున నాలుగు రోజులకు ఎనిమిదివందల రూపాయలు చెల్లించాడు ఈసారి వైజాగ్ కి నిశ్చింతగా వెళ్ళాడు

జ్వాల కేరక్టర్ లేనిదని ఆ రిపోర్ట్ వల్ల రుజువవుతుంది. జ్వాలకి ఆ రిపోర్ట్ చూపించి, సంబంధం తెంచేసుకోవాలనుకున్నాడు.

ఆయిదో రోజు ఉదయం విజయవాడ చేరుకున్నాడు సోమనాథ్. రైల్వే స్టేషన్ నించి సరాసరి ఆ ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీ ఆఫీస్ కి వెళ్ళాడు

"నే చెప్పిన పని చేశారా?" అడిగాడు.

టైప్ చేసిన రిపోర్ట్ వున్న కవరు సిద్ధంగా వుంది. దాన్ని తీసుకుని ఆటోలో ఇంటికి వస్తూ ఆటోలో దారిలో చదివాడు. సోమనాథ్ పూర్తి చేసే సరికి తను చేసిన రెండో తప్పు బోధపడింది.

మంగళవారం

రాత్రి ఏడింటికిగానీ జ్వాల ఇల్లు కదల్లేదు. మాచవరానికి రిక్షా మాట్లాడుకుంది, ఆఫీస్ మేనేజర్ యింటికి ఏడున్నరకి ఓ లారీ ఆ రిక్షాని ఎస్.ఆర్.ఆర్. కాలేజీకి కొద్దిగా ఇవతలగా గుద్దేసింది ఆమెని వెంబడిస్తున్న మా డిటెక్టివ్ వెంటనే ఆమెని హాస్పిటల్ లో చేర్పించక పోతే మరణం తప్పేదికాదు.

బుధవారం

హాస్పటల్లోంచి కదల్లేదు మీ ఆఫీస్ మేనేజర్ వచ్చి నాలుగ్గంటలు ఆమెతో కబుర్లు చెప్పి వెళ్ళాడు.

గురువారం

షరా...

శుక్రవారం

షరా : ఇవాళ మీ ఎదురింటి ఇంజనీర్ బావమరిది కూడా చూసి వెళ్ళాడు



*